కథా కోక...

వక్కలంక రామారావు

పరధ్యాన్నంగా బూట్లు విప్పుకుంటున్న సుబ్బారావు 'సుబ్బా' అన్న సుభద్రమ్మగారి పిలుపుకు ఉలిక్కిపడ్డమాట వాస్తవం. నిజం చెప్పాల్సివస్తే సుబ్బారావుకు ఉలిక్కిపడటం కొత్తకాదు. ఆ మధ్య క్లాసులో శ్యామలవంక తదేకంగా చూస్తూ స్వప్నజగతిలో విహరిస్తుండగా లెక్చరర్ — "సుబ్బారావుగారూ! పాఠం ఇటు" అన్నప్పుడు నిజంగా ఉలిక్కిపడ్డాడు. అలాగే మరోసారి సినిమాలో శంకరం భుజంచరచి 'సుబ్బా' అనగానే ఉలిక్కిపడి మామూలు మనిషయ్యాడు. ఇలా లెక్కచూస్తే ఈసారి ఉలిక్కిపడటం వేలసంఖ్యలోనే వస్తుంది.

అయితే ఈసారి ఉలిక్కిపడటంలో ఒక కొత్తదనం ఉంది. ఇన్నాళ్ళూ ఉలిక్కిపడటంలో ఒకే తరహా ధ్వనిస్తుంది. కాని ఈసారి ఒక ప్రత్యేకమయిన ఆలోచనా సముద్రంలోంచి అమాంతంగా వచ్చి ఒడ్డునపడలేక తబ్బిబ్బై ఉలిక్కిపడ్డాడు. అయితే అతన్ని ఇంత అగాధంలోకి తీసుకుపోయిన ఆలోచన ఏమిటో తెలుసుకోవాల్సివుంది.

ఉండచుట్టి టేబిల్‌మీద పడేసిన ఒక పత్రిక ఫ్యాను గాలికి పురివిప్పుకుని గంతులేస్తూంది. పత్రిక చేతిలోకి తీసుకున్న సుభద్రమ్మగారు సుబ్బారావు మౌనానికి కారణం తెలుసుకోలేక అతని ముఖంలోకి ఒకసారి, పత్రికలో బొమ్మలవైపు మరోసారి చూశారు. సుబ్బారావు ముఖంలో మార్పు లేదు. ఏదో తీవ్రమైన ఆలోచనలో కొట్టుకుంటున్నట్లుమాత్రం రూఢిగా చెప్పొచ్చు.

"సుబ్బా! ఏమిట్రా ఆ తెగని ఆలోచన ?" ఇది సుభద్రమ్మగారి ప్రశ్న.

"...... ఆఁ ఏమీ లేదు. ఆ పత్రికలో దీపావళి కథలపోటీ ప్రకటనపడింది. దానికి ఓ మాంచి కథ వ్రాసి పంపిద్దామని......"

"...... ఆలోచిస్తున్నానంటావు. దానికేం తరువాత చూడొచ్చుగాని ముందు భోజనానికి లే! పొద్దున్ననగా పోయావ్.... ఇప్పుడు రావటం మీ నాన్నగారు చూస్తే......"

"సర్లే, అది ఎప్పుడూ ఉండేదే! పద. అన్నం వడ్డించు"—సుబ్బారావు బట్టలు మార్చుకుంటూ అన్నాడు. సుభద్రమ్మగారు వంటింటివైపు వెళ్ళారు.

* * *

'సుబ్బారావ్! ఏం చదువుతున్నావ్?' అంటే 'బి. ఎ ఫైనల్ ఇయర్' అంటాడు సుబ్బారావు. అతడు తరచు అబద్ధాలాడతాడని కాలేజీలో ప్రచారమున్నా, ఈ విషయంలోమాత్రం అణుమాత్రంకూడా అబద్ధంలేదు. అయితే.. ఈమధ్య సుబ్బారావుకి జీవితమే ఓ సమస్యయి కూర్చుంది. 'ఇంతకీ నిన్ను అంతగా వేధించే సమస్య ఏమిటి సుబ్బారావ్?' అంటే .... "బద్ధకంగా నిద్దరోతున్న నా హృదయవీణను అలాఅలా మీటి రాగాలపన చేసి మేల్కొలిపి, మధురగానలహరిలో మత్తెక్కించిన మందగమన అందకుండా ఆటలాడిస్తే ఏ పురుషుడు సహించగలడు? నేనూ మామూలు మనిషినే!

జీవితాన్ని అల్లిబిల్లిగా అల్లుకుని, సమస్యలు సృష్టించుకుని, వాటినుండి విముక్తిపొందలేక అలమటించటం నాకు వేడుకకాదు. కాని ఎంత కాదనుకున్నా ఈ ఆలోచనలు నానుంచి దూరం కావటంలేదు; ఇంజనువెనుక రైలుపెట్టెల్లా నా మనసుతోపాటే వరుసగా పరుగెడుతున్నాయి..... నా హృదయవీణను మీటిన మందగమన 'శ్యామల'. ఆమె తొలిసారి నన్ను ఉద్దేశించి 'సుబ్బారావుగారూ! మీ జనరల్ నాలెడ్జి నోట్సు ఒకసారి ఇస్తారా' అన్నప్పుడు నా హృదయవీణ తీగెలు సవరించుకుని టివ్వుటివ్వు లాడింది. నా వీణాగానానికి అదే తొలి నాదం. నా ఊహాజగతికి, నా ప్రేమసౌధానికి ఆనాటి ఆ పిలుపే పునాది. ఆ పిలుపులోనే మేడలు కట్టాను. కోటలు నిర్మించాను. కాని ఆపిలుపు...నేడు....అలా అలా దూరమైపోతుందంటే నే నేమైపోతాను? నా మేడలన్నీ పునాదులతో నేలమట్టం కావలసిందేనా....' చాలామంది సుబ్బారావును వాగుడుకాయ అంటారు. సుబ్బారావుకు కవిత్వం రాకపోయినా ఈ విషయంలో (బట్టీపట్టికావచ్చు) అనర్గళంగా మాట్లాడగలడు. ఈమాటే అతని ముఖంముందు అంటే 'ఏం చేయమంటావు? నా హృదయపరితాప విముక్తికి అంతకంటే మరో మంచిమార్గంలేదు' అంటాడు. అంతటితో అతనితో కబుర్లకు ఓ అంతంటూ కలిగించకపోతే అది సముద్రంలా, లీనమవటానికి వేరే చోటులేక కొట్టుమిట్టాడిపోతుంది. అందుకే సుబ్బారావుతో ఎవరు మాట్లాడినా వీలయినంతలో తెంచుకుందుకు వీలుగా మాట్లాడతారు.

భోజనంచేసివచ్చిన సుబ్బారావు అరిచేతులు తుడుచుకుంటూ టేబిల్‌మీది సిగరెట్‌పెట్టె అందుకుని సిగరెట్ నోట్లోఉంచి నిప్పుముట్టించాడు. 'శ్యామల' పొడుగాటి శిరోజాల్లా సిగరెట్‌పొగలు పైపైకి పోతున్నాయి. 'ఒరేయ్! ఒరేయ్!! మీ నాన్నగారు చూస్తే కొంపమునుగుతుంది.. జాగ్రత్త' సుభద్రమ్మగారి హెచ్చరికకు మరోసారి ఉలిక్కిపడి 'నాన్నగారు వస్తూంటే కాస్తంత దగ్గు' అన్నాడు సుబ్బారావు.

'అలాగేకాని జాగ్రత్త సుమా! ఆయనసలే కోపిష్టి మనిషి' అంటూ అటుగా వెళ్ళిపోయిం దామె. మూడు సిగరెట్లు పరశురామప్రీతి అయినా అతని ఆలోచనకు ఓ ఒడ్డంటూ దొరకలేదు. 'ఇన్ని పత్రికలు చదివాను, ఇన్ని నవలలు చదివాను.. వెధనది ఒక్క ఐడియా, సింగల్‌థాట్.. ఛీ .... ఛీ దొరకటం లేదు. కథలు రాయటంలో ఇంత చీకాకుందని ఇంత వరకూ తెలియలేదు.... పోనీ పాతపత్రికల్లోది ఏదయినా కాస్తంత మొగ్గవేయించి ఓ కథంటూ తయారుచేస్తే సరిపోతుంది.....'

బీరువా తెరచి చూచిన సుబ్బారావు అయిదారు నిముషాలపాటు కొయ్యబొమ్మలా నిలబడిపోయాడు. నిన్ననే పత్రికలన్నీ అమ్మేసినట్లు గుర్తొచ్చింది. 'అయినా ఈమధ్య వెలువడ్డ సంచికల్లోవే కాపీకొడితే మరీ దారుణంగా ఉంటుంది. సుబ్బారావు బుర్రకు మరోసారి పనిచెప్పాడు. గడియారం మరో గంట ముందుకు పోయేసరికి మరో రెండు సిగరెట్టు గుల్లలు నేలమీదకు వలస వచ్చాయి. అయినా ఎటూ ఆలోచన తెగలేదు. 'ఛీ. ఛీ. వ్రాయటం మానేస్తే సరి గొడవ వదుల్తుంది. ఈపిచ్చి ఆలోచనలతో చికాకెత్తిపోతోంది.' సిగరెట్‌పీకె నేలమీదకు విసురుతూ స్వగతంలో విసుక్కున్నాడు.

బీరువాఅద్దంలో తన ప్రతిబింబం తెల్లసూట్లో ముందుకొచ్చి తనవైపు చూసి వెకిలిగా నవ్వింది: "వెర్రివాడా! ఆలోచించాలిగాని ఇంతలోనే నిస్పృహచెందితే ఏమవుతుంది? నీ కథ పత్రికలో పడకపోతే శ్యామల నీకు ఎలా దక్కుతుందనుకున్నావ్? ఆ 'రామం' నాలుగు కథలు అల్లటం నేర్చుకునేగదా నిక్షేపంలా నీవంటే ఇష్టపడే శ్యామలను తనవైపుకు త్రిప్పుకున్నాడు. నీవు ఈ పోటీలో విజయం సాధించకపోతే ఆ విలన్ రామం బారినుండి నీ శ్యామలకు విముక్తిలేదు. శ్యామల లేనిదే నీ జీవితంలేదు. అది నేను వేరే చెప్పనక్కరలేదు. ఆలోచించు. శ్యామలను మనస్ఫూర్తిగా కోరుతున్నవాడివయితే కథ వ్రాయటం మానేయకు. ఐడియా కేమిటి! అదే తడుతుంది. మనసు మరోలా పోనీయకు. ప్రయత్నించు! ప్రయత్నించు!!" ప్రతిబింబం గర్జించింది.

సుబ్బారావు ఓ నిర్ణయానికి వచ్చేలోపునే మరో ప్రతిబింబం నల్లసూటు ధరించి డిస్నీబొమ్మలా గంతులేస్తూ ముందుకొచ్చింది: "సుబ్బారావ్! కథలు వ్రాయటమంటే మాటలనుకున్నావా! అదేమంత సులువుకాదు. సులువయితే ఈ సరికి

—35 పేజీ చూడండి

ఆయుధపూజ!

వీరాజీ

ఇక్కడి యివాళ కాబోలు కవిత్వమ్
రేపు అవుతుందిలే నిజమ్
ఇది ఇవాల్టి కల
రేపు పండుతుందిలే ఇల.

ఆటమ్‌బాంబుతో వెలిగించు
నీ ప్రపంచంలో రాతిరుండదు
మారణాయుధాల శక్తి పిండి
మళ్లించు నదీ జలాలను పంటపొలాలకు.

నీ సైన్యాన్ని పిలిపించు
నీ హెచ్ బామ్బు శక్తి నదిలించు
నైరాశ్యాన్ని చంపించు
నలుదిక్కులా శాంతి వెలిగించు.

నీ విమానాల నెగిరించు
రవాణా సౌకర్యాలు పెంచు
దూరాల మధ్య తేడాలు తెంచు
తేడాల మధ్య భేదాలు త్రుంచు.

నీ మరటాంకుల నదిలించి దున్ను
ఈ భూమాత పచ్చగా నవ్వు
నువ్వీ ఆయుధపూజ జరుపు
నిండు శాంతిసౌఖ్యాలు రేపు.

నువ్వీ ఆయుధపూజ జరుపు!
పండు మంచి పంటలు రేపు!!

కథ కాక

26-వ పేజీ తరువాయి

ప్రతిఒక్కరూ వ్రాసేఉండేవారు. అంతా వ్రాస్తే ఇక వాటిని ప్రచురించేదెవరు? ఒకచో ప్రచురిస్తే చదివే పాఠకోత్తము లెవరు? అందులోనూ నీవు పంపదలుచుకున్నది పోటీకి. పోటీకంటే ఎన్ని వేల రచన లొస్తాయో తెలుసా? అందులో నీ అనుభవంలేని రచన అడుగున పడిపోవటంలో ఆశ్చర్యం లేదు. తీరా కథ పంపాక పడుతుంది, పేరొస్తుంది, ప్రజం టొస్తుంది అంటూ ఎదురుచూడటం; అదికాస్తా మరొకరు తన్నుకుపోవటం, దారిని పోతుంటే 'సుబ్బారావ్! నీ కథ అడుగున పడిపోయిందేమిరా' అని పదిమందీ అడగటం, నీవు ముఖంమీద జేబురుమాలు కప్పుకుని లేనినవ్వు తెచ్చుకుని 'అది అంతేలే' అని పెదిమలు చప్పరించటం. ఇంతేనా ఇంతకంటే జరిగేదేమయినాఉందా? నా మాట విని, ఈ కథలల్లటం గురించి మరేమీ ఆలోచించి కాలం, బుర్ర పాడుచేసుకోకు. మరోలా ఆలోచిస్తే శ్యామలను పొందటానికి, ఆమెఅభిమానం సంపాదించటానికి ఇంతకంటె సులువయిన మార్గాలు కనుపించకపోవు." ఈ ప్రతిబింబం ఆజ్ఞాపిస్తున్నట్లు మాట్లాడుతూ గంతులేసింది.

ఈ మాటల్లో సుబ్బారావుకు చాలా సత్యముందనిపించింది. కాని ఇంతలోనే తొలి ప్రతిబింబం సరాసరి ముందుకొచ్చి క్లోజప్‌లో కనుబొమ్మఎగరేస్తూ 'సుబ్బారావ్' అంది మరీ బిగ్గరగా. సుబ్బారావు తెల్లమాటు ప్రతిబింబంమాటలు వినదలుచుకోలేదు. 'సుబ్బారావు! సుబ్బారావ్!!' గొంతు గింజుకుంది ప్రతిబింబం. సుబ్బారావు చెవులుమూసుకున్న చేతులు తీసి సిగరెట్‌ముట్టిస్తూ 'ఏం! అంతల్లా గింజుకుంటున్నావ్' అన్నాడు.

"అవును. గింజుకుంటున్నాను. మన తెలుగు వాళ్ళకు ఉన్న తెగులే ఇది. మంచి చెప్పేవాణ్ణి ఎవరు నమ్మరు కనుక! అయినా చెప్పటం నా ధర్మం. అటుపైన నీ విధి. కథ వ్రాయటం మానేద్దామనుకుంటున్నావ్‌కదూ? సరే. మానేశావే అనుకో. శ్యామలను భార్యగా పొందటానికి మరో మంచిమార్గం కోసంమాత్రం ఆలోచించద్దూ!—కథ వ్రాయటం కష్టమనుకుంటే ఎలా? ఆ రామం నిజంగా కథలు వ్రాయటం వచ్చే రాశాడంటావా? శ్యామలకు సాహిత్యమంటే మహా ఇష్టం. కథలు వ్రాసే వాళ్ళంటే ప్రాణాలయినా ఇస్తుంది. అట్లాంటి శ్యామల సాన్నిహిత్యం సంపాదించాలంటే నీవు కథ వ్రాసి, ప్రైజుకొట్టి ఆ రామంకన్న ఘనుడనిపించాలి. నా మాట విను. ఐడియా తట్టడంలేదని భయపడి వెనుకంజ వేయకు. మెదడును ఓసారి ఓవర్‌ఆయిలింగ్ చెయ్యి. అన్నట్లు ఓ చిన్నసలహా. కథల చిట్కాలమాట మరచిపోయావు. ఓసారి అవి పూర్తిగా చదువు......"

ప్రతిబింబంమాటలు వింటూండగానే సుబ్బారావు ముఖంలో ఆనందరేఖ తళుక్కుమంది. చిట్కాలకోసం బీరువాతలుపు తెరవటంతో ప్రతిబింబంకూడా మాయమయింది. మూడుసార్లు మూడుఅరలూ తణిఖీ చేయగా ఆ పుస్తకం

నేషనల్ ఎక్కో రేడియో



ఒక ముఖ్యవార్త!

కొంతపైకము చెల్లించి రేడియో యింటికి తీసుకుపోవచ్చును; మిగిలినది 11 నెలసరి సులభవాయిదాలలో చెల్లింపవచ్చును...

వివరములకు:

రేడియో & ఎలక్ట్రికల్స్

విజయనగరం. విశాఖపట్నం. జి.

పాసినకాళ్ళ బాధనుంచి త్వరగా బయటపడండి

కాలివేళ్ళమధ్య పగిలినచోట్ల అమృతాంజన్ లిమిటెడ్‌వారి డెర్మల్ ఆయింటుమెంటును రాసి బాధను త్వరగా పూర్తిగా పోగొట్టుకోండి. తడిగా సూక్ష్మజీవులతో వుండే నేలమీద తిరగడంవల్ల కాళ్ళు పాస్తాయి. అది మీకు తరుచుగా వస్తూవుంటే, అటువంటి నేలమీద నడిచే ముందు మీ కాళ్ళకు అమృతాంజన్ లిమిటెడ్ వారి డెర్మల్ ఆయింటుమెంటును రాసుకొని నడవండి. అమృతాంజన్ లిమిటెడ్ వారి డెర్మల్ ఆయింటుమెంటు డబ్బా ఒకటి ఎప్పుడూ యింట్లో ఉంచుకోండి. అది తామర, గజ్జి దురదలకుకూడా పనికివస్తుంది.

అమృతాంజన్ లిమిటెడ్ వారి

డెర్మల్ ఆయింట్‌మెంట్

అమృతాంజన్ లిమిటెడ్ 14/15, లజ్‌చర్చి రోడ్డు, మద్రాసు-4

బొంబాయి-1, కలకత్తా-1, న్యూఢిల్లీ-1.

JWT.AM/D 1739

కథ కాక

ఎలాగో దొరికింది. తొలినుంచి చివరిదాకా మూడు సార్లు చదివాడు. అయినా ఓ కథంటూ ఆలోచన కలుగలేదు. ఆ కుక్కపిల్లకథే మదిలో మెదల్తోంది. ఎలాగో ఆ కథ వ్రాసిపారేద్దామంటే అది చాలా మందికి తెలుసున్నదేనాయె! పైగా ఈ చిట్కాలు చదివినవాళ్లలో ఇంకా ఏ ఒక్కరూ ఆ కథ రాయ లేదని నమ్మకమేమిటి? —అయినా పోటీకి పంపుతూ ఇలాటి టుంగిరీ కథా ఎన్నుకునేది? బిగువైన సన్ని వేశాలు, హృదయాన్ని కదిలించే సంఘటనలు, రసవత్తరమైన పాత్రలు, పాత్రోచితమైన సంభా షణలు—ఇవన్నీఒకదానితో నొకటి జోడించి అందంగా అయోమయం కాకుండా అల్లుకురావాలి. అయితే అదెలా సాధ్యం? ఛీ! ఛీ! ఆలోచన మళ్లీ మొదలు కొచ్చింది. నా వెర్రిగాని ఈ పుస్తకం చదివినంత మాత్రాన కథలు వ్రాయగలమా! గ్రుడ్డివానికి దీపంచూపిస్తే మాత్రం ఉపయోగం ఏమిటి? అసలు కాస్త అనుభవమంటూ ఉంటే ఏదో నాలుగుముక్కలూ అల్లుకురావచ్చు. ఈ రోజు ఏమిటో గాని చచ్చినా ఆలోచన తెగటంలేదు....."

మెట్లమీదుగా ఎవరో వస్తున్న అలికిడి అయింది. చిన్న పొడిదగ్గు వినిపించింది. సిగరెట్టు గుల్లలు రెండూ డ్రాయరుసొరుగులో నక్కి కూర్చున్నాయి. సిగరెట్—పీకలన్నీ ఓమూలగా చేరి, ఎవరికీ కనుపించకుండా ఏవో విషయాలు చర్చించుకుంటున్నాయ్. అప్పుడే సుబ్బారావుచేతుల నలంకరించిన ఎకనామిక్సు గైడు తలక్రిందులుగా తపస్సు చేస్తోంది.

'సుబ్బా!' రంగనాథంగారు పిలుస్తూనే తలుపుతెరిచి గదిలోకివచ్చారు. "ఏం నాన్నగారూ! పిలిచారా" తదేకమైన పుస్తకపఠనంలో ఉన్న సుబ్బారావు బుర్ర పైకెత్తాడు. "ఆఁ చూడు. నిన్న ఈ గదిలో భగవద్గీత మరచినట్టున్నాను.."

"ఆ ఇదుగో తీసుకోండి"

ఆయన పుస్తకం తీసుకుని మెట్లుదిగిపోయారు. సుబ్బారావు ఆలోచనల గొలుసుకు లింకులు ఊడి పోయాయి. పుస్తకం టేబిల్‌మీద పడేసి భారంగా మంచంమీద వాలిపోయాడు. తిరుగుతున్న సీలింగు ఫ్యానుచుట్టూ మెదడుకూడా తిరుగుతూంది. అలాగే పైకప్పుకేసి చూస్తూండిపోయాడు. చాలా సేపటికి సుబ్బారావు మళ్లీ వాస్తవంలోకి వచ్చాడు. టైము ఎంతయిందోనన్న అనుమానం వచ్చి, అలారం వైపు చూశాడు. పెద్దముల్లు పండ్రెండు దగ్గర చిన్నముల్లు కాగిలిలోంచి విడిపోలేక భారంగా ముందుకు కదుల్తోంది. ఒక్కసారి ఆవులించి చిటికె వేసి కళ్లుమూసుకున్నాడు.

...., ఏమయితే ఏం! కతిపయదినంబులకు సుబ్బారావు ఎలాగో బుర్ర ఖరాబుచేసుకుని ఓ కథంటూ రాశాడు. రాశాడనేకంటే తయారుచేశా డంటేనే బాగుంటుంది. పట్టిపట్టి దాన్ని ఫెయిరు చేసి, కవరులోఉంచి సంపాదకులవారి ఆదేశాను సారం 'దీపావళి కథల పోటీకి' అని పెద్ద అక్షరా లలో వ్రాసి పోస్టుచేశాడు. నిరీక్షణలో నీళ్ళు నములుతూ కూర్చోగా, కూర్చోగా ఓనాడు 'సుబ్బా రావుగారూ! మీ కథకు మొదటి బహుమతి' అనే ఉత్తరం తెచ్చిచ్చాడు పోస్ట్‌మన్. అతని ఆందానికి అవధులు లేవు. హిందీసినిమాలో హీరోఛాన్సు ఇచ్చినంతగా ఆనందపడిపోయాడు. శ్యామల దగ్గరకు పరుగెత్తుకుని వెళ్లి ఈ సంగతి చెప్పేశాడు. అమాంతంగా లావుగా అయిపోయి 'సుబ్బారావు గారూ! మీరు ఎంతటివారండీ! మీలో ఇంత ఆర్టు, స్పిరిటుఉందని మాటవరసకయినా అన లేదే. ఇంతకీ దీపావళి సంచిక ఎప్పుడొస్తుంది అంటారు? అంతవరకూ నేను మీ కథ చదవ కుండాఉండగలనా! దయఉంచి మీ కథ వ్రాతప్రతి ఒకసారి ఇస్తే వెయ్యినూటపదహారు ధన్యవాదాలు" అన్నది. సుబ్బారావు మళ్లీ పరుగెత్తుకుని ఇంటికి వెళ్లబోయి, సిటీబస్సులున్నాయని గుర్తొచ్చి కాసేపుబాధగానే నుంచుని, బసెక్కి వెళ్లి ఆ కాపీ తెచ్చిఇచ్చాడు. శ్యామల కథంతా చదివి "అబ్బ! ఎంత బాగా రాశారండీ! ఆ రావం కథలు చూసి మహ ఇదిగా ఉన్నాయనుకున్నాను. ఈ కథముందు ఆతని కథలన్నీ బలాదూరు సుమండీ. అయినా నా వెర్రిగాని ఎంత బాగుండకపోతే ఇంత ప్రముఖ పత్రికలో ప్రథమ బహుమతి లభిస్తుంది" అన్నది.

సుబ్బారావుహృదయం ఆనందంతో అంతై, ఇంతై ఆకాశమంతై శ్యామలను తనలో ఇమి డ్చేసుకుందామని తాపత్రయపడిపోయి, ఇదై పోయి అదోలా ఉండిపోయింది. అతనికళ్లల్లోబాధను గ్రహించిన శ్యామల 'సుబ్బారావుగారూ! నేనంటే మీకు ఇష్టమేనా' అనటంతో అవునని చెప్పటానికి మాటలు దొరక్క గిలగిలలాడిపోయి ఎలాగో తల మాత్రం ఊపాడు ఇష్టమేనన్నట్లు. ఆనాటి నుంచి శ్యామలా, సుబ్బారావు మరీ దగ్గరయిపోయారు. సుబ్బారావు, తల్లితో ఈ విషయం చెప్పాడు. ఆవిడ భర్తతో చెప్పటం, ఆయన శ్యామల తండ్రితో మాట్లాడు కోవటం, శ్యామల సుబ్బారావుల—పెండ్లి వైభవంగా జరిగిపోవటం సినిమా రీలులా తిరిగిపోయాయి.

ఆరోజు... అతను గదిలో వారగా నుంచున్న శ్యామల భుజంమీద చేయివేసి తనవైపు తిప్పు కున్నాడు. శ్యామల సిగ్గుదొంతరల్లో మిఠాయిలా ముడుచుకుపోయింది. ఎలాగయితేనేం ఆమెను అనున యించి, బుజ్జగించి మంచంవరకూ తీసుకొచ్చి తనప్రక్కగా కూర్చోపెట్టుకున్నాడు. శ్యామల కళ్లు దించుకుపోయాయి. సుబ్బారావు ఆమెగడ్డం పట్టు కుని పైకెత్తుతూ "శ్యామలా.... ఇటు చూడు.. అబ్బ...అంత సిగ్గా...." అన్నాడు.

"బాబూ ఏదో కలవరిస్తుండారు. ఎనిమిది కావస్తోంది. పెదబాబు కోప్పడతారు. లెగుండి బాబూ" నౌఖరుఅప్పన్న తట్టి లేపాడు. లేచి కళ్లు నులుపుకున్న సుబ్బారావు గదిపరిసరాలు ఒకసారి చూచి 'ఇదంతా కలా! ఛీ ఛీ' అంటూ బాత్ రూమ్‌వైపు వెళ్లిపోయాడు.

* * *

క్లాసు జరుగుతూన్నా సుబ్బారావు కథావస్తువు గురించి ఆలోచిస్తూనే ఉన్నాడు. పైకప్పుకు దూలాలెన్నిఉన్నాయో మూడుసార్లు లెక్కపెట్టాడు. మొదటి మూడువరసల్లో ఆడపిల్లలెంతమందో ఆరు

చందమామ విందు

"మహేశ్వర్"

అందాల జాబిల్లి
విందు జేసింది
చుక్కలన్నీ చేరి
విందు కొచ్చాయి!
బంగారు అంచుతో
సింగార మొలికించి
తెల్లనీ మేఘాలు
తెరలుగా అమరాయి!
తెరల చాటునుండి
దోబూచులాడుతూ
నీలాల నింగిలో
నిలచింది జాబిల్లి!
పిలచింది చల్లగా
పిల్ల లందరినీ
పాల వెన్నెల ఛాలు
విరబోసింది!
బోసినోరిప్పుతూ
ముత్యాలు ఒలికించి
ముచ్చట్లు గొల్పింది
ఒక ముద్దపాపాయి!
వెన్నెలల విందులో
గోరుముద్దలు మింగి
గజ్జలూ మువ్వలూ
ఘలుఘల్లుమనంగా
విందులో అందాలు
విరజిమ్ముకుంటూ
చిన్నారి చిట్టిపాప
చిందు వేసింది
చుక్కలన్నీ కలసి
ఫక్కుమన్నాయి!

చల్లగను తాజాగనుంచును
ప్రెసిడెంట్
వెజిటబుల్
హెయిరాయిల్
రచోడ్
ట్రేడింగ్ కంపెని,
మద్రాసు-1

ఏన్విల్
ఓ క్రిమి సంహారక ఆయింట్‌మెంట్

కోతలకు, రక్కులకు, ఒరుపులకు వాడండి. 'ఏన్విల్'
మొటిమలను, పొక్కులను, కీటక కాట్లనుకూడా మాన్పును.
అట్లాంటిస్ (ఈస్ట్) లిమిటెడ్ (ఇంగ్లండులో స్థాపితం)
JWT-ANV-5312 R TE
AN 2

చూచుటకు అందముగను,
వినుటకు రమ్యముగను నుండు
కోమర్
రేడియోస్

మాడల్ నం. R 44 A.
ఏ.సి. 6 వాల్వ్స్ 4 బ్యాండ్స్
వెల రూ. 250/-
ఎక్సైస్ డ్యూటీ
మరియు ఇతర
పన్నులు మినహా
తయారుచేయువారు:
సింగ్ రేడియో కంపెని, ఢిల్లీ-6
మద్రాసు, మైసూరు, కేరళ & ఆంధ్ర ప్రదేశములకు.
డిస్ట్రిబ్యూటర్లు:
కృష్ణ (సేల్స్) ఏజన్సీ,
48, మౌంట్ రోడ్, మద్రాసు-6 ఫోన్: 85168
KSA/2
సిటీ డీలర్లు: మెసర్స్ ఎన్ జీ స్,
3, బ్లాకు, 111, కాంగ్రెస్ బిల్డింగ్స్, మౌంట్ రోడ్, మద్రాసు-6.

కథ కాక

సార్లు లెక్కపెట్టాడు. శ్యామల జడవైపు తొమ్మిది సార్లు చూశాడు. మూడుసార్లు గోళ్ళు గిల్లుకున్నాడు. పదకొండు మార్లు వరండావైపు, ఒకసారి లెక్చరర్ ముఖంలోకి చూశాడు. ఏడుసార్లు పెన్నుమూత తీసి మళ్లీమూశాడు. పుస్తకంపేజీలు రెండుసార్లు తిరగేశాడు. అయినా అదేం ఖర్మమో ఏ ఐడియా తట్టలేదు. బయట గంట మ్రోగింది. లెక్చరర్ బయటకు వెళ్లిపోయాడు. క్లాసులో కొంచెం రణ గొణధ్వని బయలుదేరింది. సుబ్బారావులోమాత్రం మార్పులేదు.

చాలాసేపటినుంచి సుబ్బారావువైపు తదేకంగా చూస్తున్న శంకరం అతని ముఖంలోకి మరోసారి చూశాడు. అయినా సుబ్బారావు అజంతాశిల్పం మార్కులోనే ఆగిపోయాడు. ఈలోగా ముకుందం వెనుక బెంచీలోంచి దస్కుదూకి ముందుకొచ్చి కూర్చుంటూ 'ఒరేయ్! శంకరం! ఈ వారం పత్రికలో మా మామయ్య కథ పడిందిరోయ్'అన్నాడు. ఈమాట వినగానే సుబ్బారావు మరోసారి ఉలిక్కి పడి "ఎవరు ముకుందం? మీ మామయ్యా.... కథ ఎందులో పడింది.. ఎప్పుడు?...." అన్నాడు అనా యకంగా. అతని వాలకం చూసి ముకుందం ఓ నిముషం అదోలాఅయి, అసలు సంగతి చెప్పాడు. "ఒరేయ్ ముకుందం! అయితే మీ మామయ్యకు కథలు వ్రాయటం వచ్చన్నమాట. శంకరం! ఈ విషయం నాకు కాస్తంతయినా చెప్పావుకాదేరా?— సరే దానికేంగాని "నాకు నీతో చాలా పనుంది. అలా బయటికి వెడదాం పద" అన్నాడు సుబ్బారావు ముకుం దం చెయ్యిపట్టుకుంటూ. "నేనో" అన్నాడు శంకరం.

"రావచ్చు. అభ్యంతరంలేదు." సుబ్బారావు ఇద్దరి భుజాలమీద చెరోచెయ్యివేసి కాలేజీ గేటు వైపుకు తీసుకుపోయాడు.

సుబ్బారావు కథంతా విన్న ముకుందం, శంకరం 'అయితే నీకిప్పుడు ఓ మాంచి కథ కావాలంటావ్. అంతేనా' అన్నారు. అవునని తలఆడించాడు— సుబ్బారావు. ఆ మర్నాడు తన మామయ్య వ్రాసి ఉంచిన కథల్లో ఒక మంచి కథ చూసి ఎత్తుకొచ్చాడు ముకుందం. సుబ్బారావు ఆనందానికి అవధుల్లేవు. దానికి ప్రతిగా ముకుందం, శంకరం నయాపైసా ఖర్చులేకుండా సమస్తలాంఛనాలతో రిజర్వుడడు క్లాసులో కూర్చుని డిటెక్టివ్ పిక్చర్ చూశాడు. సుబ్బారావు ఆ వ్రాతప్రతిని పదిలంగా ఇంటికి తీసుకెళ్లి స్వదస్తూరీలో మరో కాపీతీయటం ప్రారంభించాడు.

ఆ ఎమోషన్‌లో వ్రాయటమంటే ప్రారంభిం చాడు గాని పట్టుమని పదిలైన్లు వ్రాసేసరికి చేతివేళ్ళు బాధగా మూలిగాయి. అక్షరాలు ఆకారం కోల్పోయి 'ఇది ఏభాష' అన్నట్లు క్వశ్చన్‌మార్కుల్లా తయారయ్యాయి. నిజం చెప్పాల్సివస్తే అసలు సుబ్బారావు పేజీలు, పేజీలు ఏకథాటీగా వ్రాసిం దెప్పుడు? అందులో తెలుగు (నోట్సు) వ్రాయట మంటేనే మహాచికాకు. మరోమాట వ్రాయాలంటే తీరుబడిగా కూర్చుని తెలుగునోట్సు వ్రాయటం 'పరువుహీనం' కూడాను. అందుకే సుబ్బా

రావు అడపాతడపా నోట్సులన్నీ ఆచారిచేత వ్రాయించేవాడు. ఆచారికి ఇందుమూలంగా ఏదో ప్రతిఫలం ముడుతూనేఉండేది. సుబ్బారావు పెన్ను మూసి, వేళ్లనొక్కుకుంటూ ఒక్కసారి ఆవులించి, 'రేపు రాద్దాంలే' అని మనసులో అనుకుని పేజీలు మడిచి సొరుగులో పెట్టాడు.

కదిలిపోతున్న సిటీబస్‌కు పరుగెత్తుకెళ్లి అరోహించి, హీరోలా రెండుసార్లు కాలరు సర్దుకుని ఈలవేస్తూ బస్సులోఉన్న అందర్నీ పరికించాడు—సుబ్బారావు. తన ప్రక్కసీట్లోనే కూర్చునిఉంది శ్యామల. సూటిగా ఆమెకళ్లల్లోకి చూశాడు. (ఇటువంటి అవకాశాలు చాలాఅరుదుగా వస్తాయి. వినియోగించుకోకపోవటం తెలివితక్కువ.— సుబ్బారావు డైరీ 5వ పేజీనుంచి). ఆమె కనురెప్పలు రెండుసార్లు మీటి మళ్లీ దించుకుంది. అతను వాచీవైపు చూసుకున్నాడు. పది దాటవస్తూంది. చేతిలో పుస్తకాలు మరోసారి సరిచేసి పట్టుకున్నాడు. ఈసారి శ్యామలవైపు చూసినప్పుడు ఆమెచేతుల్లో పుస్తకాలు లేవని స్పష్టపడిపోయింది. సుబ్బారావు ఓసారి క్వశ్చన్‌మార్కులా మెలితిరిగిపోయి, గడ్డివాములా రోజూ అన్నిపుస్తకాలు తీసుకొచ్చే ఈమె ఇలా నిరాడంబరంగా, చేత 'సింగిల్' పుస్తకం కూడా లేనిదై రావటంలో అర్థమేమిటా అని బుర్రకు పనిచెప్పి, అది ఒకవైపుకు మొగ్గక ముందే స్టాపు రావటంతో దిగిపోయాడు. వెనకే వస్తున్న శ్యామల తన చేతిలో పుస్తకాలు చూసి నవ్వుతుందేమోనని రెండుమూడుసార్లు వెనక్కి చూశాడు.

కాలేజీ ఆవరణలోకి ప్రవేశించగానే విషాద భరితమైన వార్త అతని హృదయాన్ని కుదిపివేసింది. శ్యామల ఈవేళ టి. సి తీసుకుంటోందని, వాళ్ల నాన్నగారికి బదిలీఅయిందని తనకు ఇంతవరకూ మాటమాత్రంగానయినా ఎవరూ చెప్పలేదు. విషాద ఘట్టంలో తెలుగుసినిమా హీరోలా రెండుసార్లు నిట్టూర్చి భారంగా క్లాసులోకి వెళ్లికూర్చున్నాడు. శ్యామలలేని క్లాసు చంద్రుడులేని ఆకాశంలా, పెట్రోలులేని కారులా, గుండీలులేని చొక్కాలా, ముఖచిత్రంలేని పత్రికలా, అదోలా అదోలా అనిపించింది. 'అంతకంటే మంచి ఉపమానాలు తట్టి ఉంటే ఈసరికి స్వంతంగానే కథలు రాసేవాణ్ణి' అనుకున్నాడు. "కనీసం 'ఇలా కాలేజీవదలి వెళ్లిపోతున్నాను' అనేనా చెప్పకుండా వెళ్ళిపోతుందా—శ్యామల" అనుకుంటూ బెంచీలో భారంగా వెనక్కి వాలిపోయాడు.

ఇంటర్‌వల్‌లో కాంటీన్‌వైపు వెడుతూండగా శ్యామల ఎదురై 'హలో! సుబ్బారావుగారూ' అంది. సుబ్బారావు ఫుల్‌స్టాప్‌లా అయిపోయి, ఉలిక్కిపడిపోయి, నాలుక రెండుసార్లు తడిచేసుకుని, గుట్టింలా దూకుతున్న తుమ్మును బలవంతాన ఆపుచేసుకుని.... 'హలో' అన్నాడు. 'నేను మన కాలేజీనుంచి వెళ్లిపోతున్నానండీ'—

ఈ న్యూసు ఇంతకుముందే తెలిసినా ఆ క్షణంలోనే తెలిసినట్లు కనీసం నటించనేనా నటించకపోతే తన భావి పటాపంచలైపోతుందని భావించి, ఓసారి వళ్లువిదిలించుకుని, విషాదం ముఖంనిండా కప్పుకుని 'ఆఁ! మీరు.... వెళ్లిపోతారా?—' అన్నాడు మాటికి పదిపాళ్లు ఆశ్చర్యంకూడా కలిపి.

"అవును.. మా నాన్నగారికి బదిలీఅయింది."

"అయామ్ వెరీ సారీ.... మీరు...."

"ప్లీజ్. మరోలాభావించకండి. నేను చాలా మందితో చెప్పాలి. వస్తా. మరచిపోకండి...."

"తరచు లెటర్లు రాస్తూంటారుకదూ...."

"ఊ...."

* * *

శ్యామల ఊరువదలి పదిరోజులయింది. సుబ్బారావు గంటల్లో లెక్కపెట్టాడు కాబట్టి '240' గంటలు అయిందనే చెప్పాలి. ఇది కథ కాబట్టి సుబ్బారావు శ్యామలకోసం బెంగపెట్టుకున్నాడంటే సరిపోదు. అతని కళ్లు ఆమెకోసం కాయలుకాచాయి. ఆతని మనసు ఆమెతలపుల్లో గిలగిల్లాడింది. హృదయం పరితపించింది. ఆమెదగ్గరనుంచి ఇంతవరకూ ఉత్తరం లేకపోవటంతో సుబ్బారావు నిరీక్షణకు ఓరూపంఅంటూ ఏర్పడలేదనే అనుకోవాలి. ఈ బాధలో, ఈ విరహంలో, ఈ పరితాపంలో ఒకవేళ అతను మరోనాలుగు పేజీల కథ ఫెయిర్ చేశాడన్నా నమ్మేవాళ్లుండరు. ఎలా నమ్ముతారు? ప్రేమ.... మరోపని చేయనిస్తుందా? మనసుకు నిలకడ, నిశ్చలత కలిగిస్తుందా? అయినా ఇది ప్రేమ సఫలతా కార్యక్రమంలోదే కాబట్టి వ్రాశానేమో అనుకోవచ్చు.

ఆవేళ సుబ్బారావు ఇక ఉగ్గబట్టలేకపోయాడు. క్రిందటి సంవత్సరం గ్రూపుఫోటోతీసి శ్యామల వైపు పదకొండుసార్లుచూశాడు. పన్రెండోసారి ఆమెముఖం ఇక చూడలేక (విసుగువచ్చికాదు) బాధతో ఫోటో తిరగేసి కళ్లనీళ్లుపెట్టుకున్నాడు. ఏమయినాసరే ఈ వేళ తనకుతానుగా ఆమెకు ఓలేఖ రాయాలని నిశ్చయించుకున్నాడు. ఆ లేఖలో సాహిత్యమంతా గుప్పించేయాలి. తను వ్రాసిన ప్రతి మాటా అయస్కాంతంలా పనిచేసి శ్యామల హృదయాన్ని తనవైపుకు బలంగా ఆకర్షించాలి. అయితే సాహిత్యానుభవం, అంతంతమాత్రంగా ఉన్న తను ఈ లేఖలో ఇన్నిరసాలు చొప్పించటమంటే మాటలా! సుబ్బారావు మనసులో ముకుందంగాడి మావయ్య మెదిలాడు. త్వరత్వరగా బట్టలు వేసుకుని వెళ్లి, ముకుందాన్ని కలుసుకుని సంగతంతా వాళ్ల మామయ్యతో చెప్పి, ఓ బ్రహ్మాండమయిన లేఖ తయారుచేయించి, కష్టపడి ఎలాగో దాన్ని తన స్వదస్తూరిలో ఫెయిర్‌చేశాడు. తీరాపోస్టుచేయబోతే ఆవేళ ఆదివారమని, స్టాంపులు దొరకవని గుర్తొచ్చి, కథకూడా ఫెయిర్‌కాపీ వ్రాస్తే—రెండూ మర్నాడు పోస్టుచేయవచ్చని ఎలాగో దాన్ని పూర్తిచేశాడు సుబ్బారావు.

మర్నాడు సోమవారం, ఉత్తరం, కథ పోస్టుచేసి, చేతులు దులుపుకుని 'హమ్మయ్య' అనుకున్నాడు సుబ్బారావు.

అసలు శ్యామలకు సుబ్బారావుమీద, అతని హృదయంపైన ఒకప్రత్యేకమయిన దృష్టిఉందో లేదో తెలియదుగాని అతడుమాత్రం ఆమెనుంచి వచ్చే జవాబుకై వళ్లంతా కళ్లుచేసుకుని (అన్ని కళ్లజోళ్లు కొనుక్కోలేక) బాధపడ్డాడు. అయినా శ్యామలదగ్గరనుంచి ఓ ఉత్తరమంటూ దర్శనమీయలేదు.

సుబ్బారావు హృదయం కురిడీకొబ్బరిలా ఎండిపోయింది. చివరకు కతిపయదినంబులకు, సుబ్బారావు పరధ్యాన్నంగా పత్రికచూస్తూ, శ్యామల కథకు మొదటిబహుమతి రావటం గ్రహించి అలాగే ఉండిపోయాడు. మొదటి పేరా చదవకముందే అది తనుఫెయిర్‌చేసిపంపిన 'ముకుందం మామయ్య' వ్రాసిన కథని తేలిపోయింది. పాపం ఆరడుగుల సుబ్బారావు మూడడుగులు ముడుచుకుపోయి ముక్కుమీద వేలేసుకున్నాడు.

ఇంతకీ సుబ్బారావు కథ, ఉత్తరం పోస్టుచేయటంలో చిరునామాలు తప్పువ్రాయటంవల్ల ఇలా జరిగిందని గ్రహించాడా? శ్యామల అసలు సుబ్బారావును ప్రేమించిందా? ప్రేమిస్తే అతడి కథను ఇలా తస్కరించటంలో ఆమెఉద్దేశ్య మేమిటి? ఈ విషాదంఅంతా తనను ముసురుకున్నాక సుబ్బారావు ఏం చేశాడు? ఇంతకీ 'ఇదీ ఓ కథే?' ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలంటే (సాధారణంగా) వెండితెర చూస్తే సరిపోతుందేమో అనిపిస్తుంది. కాని ప్రస్తుతం కాగితంకూడా కరువైపోయి పత్రికలు తక్కువ కాపీలు అచ్చువేస్తున్న ఈరోజుల్లో ఈ కథాకమామీషు పూర్తిచేయటానికి వేరే తెర సృష్టించటం సాధ్యపడదు. కనుక శలవు. ★

తనదగ్గరకు ఉద్యోగానికి వచ్చిన ఓ కొత్తవ్యక్తిని వ్యాపారస్తుడిలా అడిగాడు.

"డబుల్ ఎంట్రీ వేయగలవా ?"

"డబుల్ ఎంట్రీ ఏమిటండీ? ట్రిబుల్ ఎంట్రీకూడా వేయగల్ను. పనిచేసే భాగస్థుడికి అధికలాభాలు చూపిస్తూ, మందకొడి భాగస్థుడికి స్వల్పలాభాలు చూపిస్తూ, మనలెక్కల్లో నష్టం ప్రభుత్వానికి చూపిస్తూ వెరసి మూడు ఎంట్రీలు వ్రాయగల్ను!"

శివకామయ్య (చిత్తూరు.)